# సీన్ రివర్స్

- శంకరమంచి పార్థసారధి

దురదృష్టవంతులంతా కలిసి ఏదైనా యూనియన్‌గా ఏర్పడితే దానికి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగానో, కార్యదర్శిగానో ఎన్నుకోతగ్గవాడు సూరిబాబు. అంతటి చరిత్ర , అర్హత వున్నవాడు.

సూరిబాబుది అయిరన్ లెగ్గని, అతనికి ఉద్యోగం ఇస్తే ఇక అంతే సంగతులన్న నిమ్మిక నగరంలో కాలుష్యంలా వ్యాపించింది.

గంతలో రెండు మూడు దురదృష్టకర సంఘటనలు జరిగిన మాట వాస్తవం. టింబరు డిపోలో పనికి కుదిరిన వారంలోగానే డిపో మొత్తం కాలి బూడిదయిపోయింది. యజమాని లబోదిబో. చిట్‌ఫండ్ కంపెనీలో చేరిన రెండు నెల్లకే పవిత్రమూర్తిగారు అయిదు కోట్లకి శఠగోపం పెట్టి పరారయ్యారు. ఏదో విధంగా జీవితంలో సెటలయిపోవాలని సూరిబాబు తహ తహ. అలాంటి తరుణంలో ఒకరోజు ఉదయం పేపరు చూస్తుండగా మహత్తరమైన ఆలోచన వచ్చింది. వెంటనే హుటాహుటిగా తన సలహాదారుడు ప్రజామూర్తి దగ్గరకి ప్రయాణం అయ్యాడు.

ప్రజామూర్తి మొబైల్ కంపెనీలో చిన్న ఉద్యోగి. సూరిబాబంటే జాలి, అభిమానం సూరిబాబు సుడిగాలిలా వచ్చి " అర్జంటుగా నాకో సలహా కావాలి - నేను అర్జంటుగా జైలుకెళ్ళాలి. ఎలా ? " అన్నాడే కుర్చీ లాక్కుని.

ప్రజామూర్తి క్యాజువల్గా " ఏం - అక్కడేవన్నా జాబ్స్‌గాని వున్నాయా. దీనికి సలహా దేనికి బస్సులున్నాయ్. ఆటోలున్నాయ్ " అన్నాడు.

సూరిబాబుకి జాలేసింది. తన మాస్టర్ ప్లాన్ తెలీక అలా అంటున్నాడుగాని తాను చెప్పబోయేది విన్నాక సంతోషంతో కౌగిలించుకుని, అభినందిస్తాడు.

" మూర్తీ ! జైలుకి వెళ్ళాలి అంటే దానర్థం ఉద్యోగ వేట లోనో, చూసి రావటానికో కాదు. కొన్నాళ్ళు - కనీసం రెండు నెలల పాటైనా ఖైదీగా వుండాలి. ఇప్పుడు చెప్పు జైలుకి వెళ్ళటం ఎలా ? " ప్రజామూర్తికి మైండ్ బ్లాంకయి, సిగ్నల్సు అందని మొబైల్లాగా మొద్దుబారింది.

" సూరిబాబు నువ్వేం అంటున్నావో నాకేం అర్థం కాకుండా వుంది. జైలంటావ్.

అక్కడ కొంతకాలం వుండాలంటావ్. లైఫ్‌లో సెటిలవుతానంటావ్.

అన్నీ పరస్పర విరుద్ధమైన విషయాలు. నీ మనసులో ఏముందో చెప్తే గదా నేనేదైనా సలహా గాని, సాహాయం గానీ, చేయగలిగేది " అన్నాడు.

అంతలో ప్రజామూర్తి భార్య రెండు కప్పులతో కాఫీ తెచ్చి ఇచ్చింది. " ఏం సూరిబాబు కనిపించక చాలా రోజులైంది. వూళ్ళో లేవా ! ఎక్కడైనా ఉద్యాగానికి చేరావా ? " అనడిగింది. దానికి సూరిబాబు కాళ్ళుపుకుంటూ. "

" ఇప్పుడా పన్లోనే వున్నా సిస్టర్ – నా ప్రయత్నం ఫలిస్తే మీ వారికి కూడా గొప్ప ఉద్యోగం వేయిస్తా. ప్రామిస్ "

కాఫీలు తాగటం పూర్తయ్యాక , ప్రజామూర్తి " ఇప్పుడు చెప్పు ఏమిటి నీ ప్లాన్ " అనడిగాడు.

ఆ మాటకి సూరిబాబు దర్జాగా వెనక్కి వాలి కూర్చుని షర్టు కాలరు పైకిలేపి గొప్ప గొప్ప ఆలోచనలు అందరికి అర్ధంకావు. జాగ్రత్తగా ఫాలో అవ్వు.

మనం లైఫ్‌లో పైకిరావాలంటే గొప్పవాడి సహాయ సహకారాలు కావాలి. అవునా ? గొప్పవాడి సహాయం పొందాలంటే ముందుగా మనం ' వారి దృష్టిలో పడాలి కదా ! మరిప్పుడు గొప్ప గొప్ప వారంతా ఎక్కడున్నారు ? జైల్లో కదా ! బడాబడా వ్యాపారస్తులు , క్లాస్‌వన్ అధికారులు , మినిస్టర్లు , జడ్జీలు , యువనేతలు – గంపకెత్తి కుమ్మరించినట్టుగా జైలునిండా వున్నారు.

ఇలాంటి టైమ్‌లోనే వెళ్ళి ఇక నెల రోజులు అక్కడున్నావనుకో ! ఎన్ని పరిచయాలు – ఓహ్ ! నా సంగతి నీకు తెల్సుకదా.అందిస్తే అల్లుకుపోయే టైపు. అలా పరిచయాలు చేసుకుని బయటి కొచ్చాకా వారిని కల్సి " సార్ గుర్తుపట్టేరా. సూరిబాబుని మీరు నేను జైల్లో మొక్కలకి నీళ్ళుపోసి, గడ్డి పీకాం " అంటూ దగ్గరయిపోతాం. ఎలా వుంది ఆలోచన అంటూ ముగించాడు సూరిబాబు.

ప్రజామూర్తికి వాడి తెలివితేటలకి కళ్ళు చమర్చినాయి. " ఇన్ని తెలివి తేటలు గల వాడివి జైలుకెళ్ళే మార్గం నేచెప్పటం ఏమిటి. నానసెన్స్. నువ్వు ఉన్నత స్థాయికి ఎదగటానికి జైలుకి వెళ్ళాలనుకుంటున్నావ్ కాబట్టి, మొబైల్ టవరెక్కి, జైలుకి పంపకపోతే దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించు. ఆత్మహత్యా ప్రయత్నం కింద ఒకనెలో, రెండు నెలలో వేస్తారు. నీ కోరిక తీరుతుంది " అన్నాడు. ఆ సలహా సూరి బాబుకి బాగా సూటయింది.

" రైట్ రేపే ముహూర్తం, మీరు దగ్గరుండి ఈ కార్యక్రమం జరిపించాలి " అని లేచి చక్కాపోయాడు.

మార్నాడు ఉదయం సూరిబాబు నగరం నడిబొడ్డున వున్న మొబైల్ టవర్ దగ్గరకు చేరుకున్నాడు. పది నిమిషాల్లో ప్రజామూర్తి కూడా అక్కడికి చేరుకున్నాడు.

సూరిబాబు వెంట తెచ్చిన నారికేళాన్ని నేలకేసి భళ్ళున కొట్టి కళ్ళు మూసుకుని కాసేపు దైవప్రార్ధన చేశాడు అటుగా స్కూలుకి వెళుతున్న పిల్లలు ఆగిపోయి విచిత్ర సన్నివేశాన్ని ఆసక్తిగా చూస్తూ నిలుచుండిపోయారు. సూరిబాబు కళ్ళు తెరిచి కొబ్బరిముక్కల ప్రసాదం పిల్లలికి పంపిణీ చేయసాగేడు.

వాళ్ళల్లో ఒకడు ధైర్యం చేసి " ఏంటంకుల్ టవర్‌కి పూజలు చేస్తున్నారు. బాంబుగాని పెడతారా " అనడిగాడు. " లేదు బాబూ, జీవితంలో పైకి రావటానికి టవరెక్కబోతున్నా " అని " ప్రజామూర్తితో నువ్వు కడదాకా ఇక్కడే వుండి కార్యక్రమాల్ని విజయవంతం చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో రాజీ ప్రసక్తే లేదు. జైలుకి వెళ్ళటం తప్ప వేరేమాటే వుండకూడదు. ఛానల్సు ఫోన్లు చేసి పిలిపించు. మనకి కవరేజీ రావాలి. ఓకేనా ? తేడా వచ్చిందో "

" వద్దు శాపం పెట్టొద్దు. నువ్వు చెప్పినట్టే జరిపిస్తా. వర్జ్యం వచ్చే వేళ్ళయ్యింది. నీ సాహస కృత్యాన్ని కుడికాలు పెట్టి ప్రారంభించు. పిల్లలూ చప్పట్లు " అనగానే పిల్లల చప్పట్ల మధ్యన సూరిబాబు టవరింగ్ జర్నీ ప్రారంభం అయ్యింది. ఒక పదినిమిషాలు ఉత్సాహంగా ఎగబాకేడు. ఊపిరి పీల్చుకోటానికి ఆగి కిందికి చూశాడు.

అప్పటికే జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. పోలీసులు రావటంతో ప్రశాంతంగా వున్న వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఛానల్స్ వారి గొడుగు వ్యాన్లు యుద్ధ నౌకల్లా బారులు తీరి నిల్చున్నాయి. ఈ సంఘటన గురించి ఒక్కో ఛానల్ వారు ఒక్కోరకంగా వార్తని స్క్రోలింగ్ రూపంలో ప్రజల్లోకి పంపిస్తున్నారు.

" జైలుకి పంపమని టవరెక్కిన యువకుడు అని ఒకరు, జైల్లో వున్న విఐపిల తాలుకు మనిషా, సింపతీ కోసం డ్రామానా అని ఇంకొకరు, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాల కుట్రా అని ఇంకొకరు, పొంతన లేకుండా కథనాలు వండి వారుస్తున్నారు.

ఒక ఛానెల్లో అయితే ' జైలుకెళ్ళాలంటున్న యువత ఏవిటి మన భవిత ' అంటూ మేధావులతో చర్చా కార్యక్రమం మొదలుపెట్టింది. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఈ కుర్రవాడెవడు, ఎందుకు టవరెక్కాడు వగైరా వివరాల సేకరణలో పడ్డారు.

నగరంలో ఇదొక సంచలన వార్తయి కూర్చుంది.

ఇదంతా తెలీని సూరిబాబు, పట్టుదలగా తిరుపతి కొండమెట్లు ఎక్కినట్టు చకచకా పైకి చేరుకుంటున్నాడు. మనిషి ఆలోచనా సరళి ఎలా మారుతూ వుంటుందో చెప్పటం కష్టం. ఒక ఆలోచన నీ జీవితాన్నే మార్చేస్తుంది అంటారు. కాని ఆ ఆలోచన ఎప్పుడొస్తుందో మాత్రం ఎవరూ చెప్పలేరు.

చకాచకా ఎక్కుతున్న సూరిబాబుకి అకస్మాత్తుగా ఒక ఆలోచనల తట్టింది. ‘ నేనెందుకు టవరెక్కుతున్నాను ? జైలుకెళ్ళి ప్రముఖులని కలవటానికి. దొరికిపోయినవారు కాక దొరకని దొంగ ప్రముఖులు బయట ఇంకా చాలామంది వున్నారు కదా ! వారిని కల్సి పరిచయాలు పెంచుకోవచ్చు కదా. జైలుకెందుకు వెళ్ళటం ? ’ ఈ ఆలోచన వచ్చేసరికి సూరిబాబులో ఆవేశం తగ్గింది. ఆలోచించిన దగ్గరనించి ఇదంతా వృధాప్రయాస అనిపించింది. పైకి వెళుతున్న వాడల్లా ఒక్కొక్క మెట్టు కిందకి దిగసాగాడు.

“ నిన్ను జైలుకి పంపిస్తాం . అమ్మతోడు. కిందకి దిగిరా ” అంటూ అరుస్తున్న పోలీసు అధికారి మెల్లిమెల్లిగా దిగటం చూసి ప్రమోషన్ వచ్చినంతగా సంతోషించాడు.

అరగంట తర్వాత సూరిబాబు నేలపైన అడుగుపెట్టగానే పోలీసులు చట్టుముట్టి అతడిని వ్యాన్‌వైపు తీసుకుపోతుండగా మీడియావారు గొట్టాలు చేత్తో పుచ్చుకుని వెంటే పరిగెడుతూ “ సార్ మీరెందుకు టవరెక్కారు ? ఎందుకు దిగేసారు. మీ వెనక ఎవరున్నారు ? ” అంటూ రకరకాల ప్రశ్నలు అడుగుతున్నారు.

సూరిబాబు ప్రజామూర్తి గురించి అన్నివైపులా చూసి “ నా మిత్రుడు ప్రజా మూర్తి ” ఎక్కడ అనే ఉద్దేశంతో గొణుక్కున్నట్టుగా అన్నాడు. కానీ మీడియావారు ఆపార్ధం చేసుకుని “ ఫలానా పార్టీ కార్యకర్త ప్రజామూర్తి ఈ సంఘటన వెనక వున్నట్ట . అనే కథనాన్ని ప్రచారం చేశారు.

ప్రజామూర్తికి చెమటలు పోశాయి.

రెండు గంటలు తర్వాత, కంట్రోల్ రూమ్‌లో సూరిబాబుని, ప్రజామూర్తిని ఎదురెదురుగా కూర్చోపెట్టుకుని విచారణ ప్రారంభించారు. అధికారి సూరిబాబుని అడిగాడు “ నువ్వెందుకు టవరెక్కావ్ ” అని. సూరిబాబు , ప్రజా మూర్తి వంక చూసి “ టవరెందుకు ఎక్కాను ” అన్నాడు.

“ జైలకెళ్ళటానికి ” అందించాడు ప్రజామూర్తి.

“ అవును కదా. జైలుకెళ్ళాటానికి ”

“ జైలుకెందుకు వెళ్ళటం ? ” మళ్ళీ ప్రశ్న. ప్రజామూర్తి వంక మళ్ళీ చూశాడు

సూరిబాబు.

" ప్రముఖులతో పరిచయాల కోసం " అన్నాడు. క్రమక్రమంగా విచారణ ధోరణికి మారి, పోలీసు ఆఫీసరు, ప్రజా మూర్తి ముఖాముఖిగా మాట్లాడుకుంటున్నారు.

" నీ వెనక ఎవరన్నావున్నారా ". " లేరు " . " టవరెక్కటం చట్ట రీత్యానేరం అని తెలిసే ఎక్కేవా "

" అవును " గంట విచారణ తర్వాత పోలీసులు ఒక నిర్ణయానికి వచ్చారు. సూరిబాబు అమాయకుడు.

ఈ ప్రజామూర్తి అనే రాజకీయ కార్యకర్త రెచ్చగొట్టి దగ్గరుండి టవరెక్కించాడు. నగరంలో శాంతి భద్రతలని భంగం చేయటమే లక్ష్యం.

కోర్టువారుకూడా పోలీసువారి కథనానికి ఊతం ఇస్తున్నట్టుగా , ప్రజామూర్తికి ఆర్నెల్లు జైలు, రెండు వేల జరిమానా విధించి, సూరిబాబుకి వార్నింగిచ్చి వదిలేశారు. సూరిబాబు జైలుయాత్రపథకం ఆ విధంగా ముగిసింది.

------- అయ్యిపోయింది -------